# ఆజాదీ

12

పగటి ఎండలు ముదరడమేగాక, సాయంత్రాలు కూడా కాస్త ఆలస్యంగా చల్లబడుతున్న చైత్రమాసపు నడిమి రోజులు. ఎండవేడిని ఆపడానికి కిటికీలు, తలుపులు మూసి వేసి కూలర్ వేసిన గది ఉన్నట్లుండి విద్యుచ్ఛక్తి నిలిచి పోవడంతో ఆవిర్లెత్తిపోయింది. ఊపిరాడనివ్వలేదు. అందుకని వీధి గుమ్మం లో కొచ్చి నిలబడింది ఝాన్సీలక్ష్మి. ఈవేళప్పుడు రోజూ మొక్క లకి నీళ్ళు పెట్టడమో, రమణకి ఇంగ్లీషు గ్రామరు చెప్పడమో, స్రవంతితో చెస్ ఆడడమో చేస్తూ ఉండేది.

అంతేకాక తనకి రోజూ వీధిలో నీళ్ళు చల్లి ముగ్గువేసే పని ఉండేది. ఈ సాయంత్రం ఆ పని తప్పిపోయింది.

వీధిలో మట్టిపోసి చదును చేశారు. ఈరోజు సాయం త్రం కాకముందే బాగా నీళ్ళు చల్లి మళ్ళీ దిమ్మెస కొట్టారు. దానిమీద ఎర్రటి పరజా పట్టా పరిచారు. వీధి వీధంతా సంబ రానికి సిద్ధమైపోయింది.

వీధంతా క్రొత్త తాటాకు పందిరి వేశారు. క్రొత్త తాటాకు కుండే సువాసన, దానికి కట్టిన మామిడిమండలు, కడుతున్న మల్లెదండల తోరణాలూ కలగలసిన ఒక జ్ఞాపకాల వాసన, ఆమెని కమ్మేసింది. నలభై ఏళ్ళ క్రిందట ఈ వీధంతా ఇలాగే తాటాకు పందిరి. ఆ పందిరి కోసం తాటాకు కొన్నదేలేదు. వెంకట్రామయ్యగారి అమ్మాయి పెళ్ళికి పందిరి వెయ్యాలనే విషయం తెలీగానే తాటాకు వచ్చి కుప్పపడింది. పందిరివేసే కూలీల కోసమూ ప్రయత్నించలేదు. ఉరుకులు పరుగుల మీద మనుష్యులు వచ్చారు. ఆ పందిరికింత అలంకారమూ లేదు. ఈ పందిరి తాటాకు క్రింద తెల్లటి చాందినీ కుట్టారు. దానిని రంగు రంగుల పూలతో అలంకరించారు. మల్లెలు, కనకాంబరాలు, మరువం, గులాబీలు, ఎక్కడెక్కడినించో తెచ్చారు. పందిరికి పల్లెటూరి 'లుక్' రావడానికి హరికెన్ లాంతర్ల వంటి ఎలక్ట్రిక్ లైట్లు అమర్చారు. వీధి మొదట్లో అట్టలతో కుటీరం కట్టి దాని మీద రెల్లుగడ్డి కప్పు వేసి, గోడల మీద ముగ్గు స్టిక్కర్లు అతికించి గ్రామీణ 'లుక్' తెచ్చారు రిసెప్షన్ కౌంటర్‌కి. బహుశా పట్టు పావడాలు వంకీలు, వడ్డాణాల అమ్మాయిలకి మల్లెపూల జడలు వేసి, పాపడి బిళ్ళలు, చెవులకి రాళ్ళజూకాలూ పెట్టి అక్కడ నిలబెట్టి, వాళ్ళచేత వెండి పన్నీరుబుడ్లలోంచి పన్నీరు చల్లిస్తారనుకుంటా! నలభై ఏళ్ళనాడు ఈ వీధంతా వేసిన తాటాకు పందిరికి, ఇంత హంగూ ఆర్భాటమూ లేవు. దాని క్రింద జరిగింది కూడా సీదా సాదా వివాహం!

పదిహేనేళ్ళు స్వాతంత్ర్యోద్యమంలో పనిచేసి, కాస్తో కూస్తో ఆస్తి పోగొట్టుకుని చివరికి ఒక డాబా యిల్లు, రెండెకరాల పొలంతో మిగిలిన వెంకట్రామయ్యగారమ్మాయికీ, కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేసి చివరికి విజయవాడలో ఒక పరిశ్రమ నెలకొల్పిన కుటుంబరావుగారి కనిష్ట పుత్రుడికీ జరిగిన వివాహం అది. ఇప్పుడీ వన్నెచిన్నెల పందిరిలో జరగబోయేది బోసు బాబు గారి షష్టిపూర్తి మహోత్సవం. పదేళ్ళుగా ఎవరు లేకుండా బ్రతకడానికి అలవాటు పడుతోందో, ఆ రామ్మోహన్ స్మృతుల్ని కెలుకుతోంది ఈ పందిరి.

అసలు ఈరోజు ఉదయం నుంచే కాదు, గత కొద్దికాలంగా ఒక దుఃఖపు తెర కమ్ముకునే ఉంది. ఈరోజు ఉదయం వార్తాపత్రికలో చేతులు పోగొట్టుకున్న ఇరాక్‌బాలుడి చిత్రం చూసినప్పుడు, ముసలి ముతక తల్లిదండ్రుల్ని గుండెరాయి చేసుకుని ఉన్న ఊళ్ళోనే వదలి పొట్టచేత పట్టుకుని వలసపోతున్న కరవు ప్రాంతపు ప్రజల కథలు విన్నప్పుడు, తిండినీళ్ళ కన్నా, మానవత్వం కన్నా మతం ప్రధానమైపోతోందని అర్థం అవుతున్నప్పుడు, హత్యలు ఆత్మహత్యలు, గుర్తు తెలీని శవాలు, మోసాలే పత్రికల నిండా వార్తలయినప్పుడు, ప్రజలకీ, ప్రజానాయకులకీ ఉండవలసిన సంబంధాలు వికృతంగా మారిపోతున్నప్పుడు, ఒక అనంత దుఃఖసాగరం అందర్నీ ముంచెత్తడానికి పొంగి వస్తున్నప్పుడు బహుశా ఏదో ఒక పెనుమార్పుకివి సూచనలేమో! పాత జ్ఞాపకాలన్నీ ఒక గాజుపాత్రలో వేసి గిలకరించినట్లు అన్నీ కలగలిసి కళ్ళ ముందుకు వస్తున్నాయి.

"ఝాన్సత్తా నిన్ను మా నాన్నమ్మ రమ్మని చెప్పమంది. రేపు ఢిల్లీ వెళ్ళిపోతోందిగా ఇహ రాదు" అనే కంఠం విని ఉలిక్కిపడి ప్రక్కకి చూసింది. అన్నపూర్ణమ్మగారి మనవరాలు శ్రావణి. అవునుకదా! ఆవిడ వెళ్ళిపోతోంది. ఇక రాదు. "వస్తున్నా పద! లోపలికెళ్ళి జ్యోతికి చెప్పొస్తా" అని లోపలికి వచ్చింది.

వారంరోజులుగా అలసట లేకుండా సామాన్లు సర్దుతోంది జ్యోతి. కూకటివేళ్ళతో పెకిలించడంలాగ. హైదరాబాద్‌కీ ఈ వూరికీ మధ్య సప్త సముద్రాలేం లేవు. రాత్రి రైలెక్కి పడుకుంటే నిద్ర లేచేసరికి ఇక్కడుండొచ్చు. తెగతెంపులు చేసుకుపోతున్నట్టుంది. సర్దిన సామానంతా గోడవారగా పెట్టింది. ఇల్లు రైల్వే ప్లాట్‌ఫాంలా ఉంది.

ఈలోగా గరగరమంటూ ఘుమఘుమలాడుతూ కస్తూరమ్మొచ్చింది. వస్తూనే బంగారం కుంకుమ భరిణలోంచి కుంకుమ తీసి జ్యోతికీ, ఆమె కూతురు స్రవంతికీ బొట్టుపెట్టి, "తెలుసుగా! రేపు మీ బోసుబాబాయిగారి షష్టిపూర్తి. ఈపూట కాణ్ణించీ మీరక్కడే. రాత్రి భోజనానికొచ్చెయ్యండి. రేపు ప్రొద్దున కాఫీలవీ అక్కడే. నేనొచ్చి పిలకవపోతే ఝాన్సొదిన రాదని సాయంగా వచ్చా. ఏవమ్మోయ్ అర్థం అయిందా!" అంది ఝాన్సీ వంక తిరిగి.

"అవునవును వదిన్ని బాగా అర్థం చేసుకున్నావు" అంది ఝాన్సీ.

"అదేంగాదులే వదినా ముఖ్యమైన మనాళ్ళందర్నీ నేనే పిలుస్తున్నా. తక్కినిళ్ళకి రాణిని పంపాలే వస్తా! రాత్రి భోజనాలు ఇదిగో ఈ పందిట్లోనే. అయితే మనకి మాత్రం మనింటో డాబా మీద షామియానా వేయించాం. మీరక్కడికే వచ్చెయ్యండి" అని అంతే వేగంగా వెళ్ళి పోయింది. వెడుతూ ఒకింత విదేశీ పరిమళపు చల్లదనాన్ని వదిలిపోయింది.

"నేను అన్నపూర్ణమ్మ పిన్నిని చూసొస్తా" అని చెప్పులు తగిలించుకుని బయటపడింది ఝాన్సీ.

బాగా ముగ్గిన జామపండులా వాకిట్లో మంచం మీద కూర్చుని ఉంది ఆవిడ. ఎనభై ఏళ్ళ మనిషి. ఝాన్సీని గుర్తుపట్టి దగ్గరికి పిలిచి కూర్చోబెట్టుకుంది. ఉబికిఉబికి వస్తున్న కన్నీటిని ఆపుకోడానికి వృధా ప్రయత్నం చేస్తోంది. ఆవిడకేం చెప్పాలో తెలీడంలేదు. పదిహేనేళ్ళ ప్రాయంలో కొత్త మనుషుల మధ్యకి బిక్కుబిక్కుమంటూ ఆ ఇంట్లో కాలు పెట్టింది ఆవిడ. అరవయ్యేడు సంవత్సరాల పాటు ఆ ఇంట్లో బ్రతికింది. ఎప్పుడైనా వారం పదిరోజులకి ఎక్కువ ఎక్కడా ఉండని మనిషి.

ఊళ్ళో ఎవరి పిల్లల పూలజడల్లోకి కరకాంబరం పూలు తక్కువైనా, అర్జెంటుగా ఏ కూరలోకో కరివేపాకు రెబ్బ కావల్సినా 'అన్నపూర్ణమ్మ' గారింటికి రావడం మామూలే. అప్పుడు వాళ్ళంతా ఆ ఇంటిని 'రాఘవయ్య గారిల్లు' అనేవాళ్ళు కారు. ఇప్పుడు హఠాత్తుగా ఆ ఇల్లు ఒక ఆస్తిగా ప్రత్యక్షమై అది ఆవిడది కాకుండాపోయింది. ఆవిడకక్కడ చోటు లేకుండా పోయింది. మళ్ళీ ఇప్పుడు ఏనభైఏళ్ళ ప్రాయంలో తనకంతగా చనువులేని మనుష్యుల మధ్యకి బిక్కుబిక్కుమంటూ బయల్దేరాల్సి వచ్చింది.

రాఘవయ్యగారి పెద్దకొడుక్కి చదువొచ్చింది. ఉద్యోగం వచ్చింది. ప్రమోషన్లొచ్చాయి. అతను ఢిల్లీలోనే ఇల్లు కట్టుకుని స్థిరపడ్డాడు. ఈ ఊరి హైస్కూల్లో చదువు అయిపోయినాక అతనిక్కడ ఉన్నదే తక్కువ. కాలేజి చదువూ, ఆ తరువాత ఉద్యోగం.

ఆరుగురు పిల్లలు, వచ్చీపోయే బంధువులు, పూజలు, నోములు, వ్రతాలు, జబ్బులు, పెద్దల తద్దినాలు వీటన్నింటితో తన సంతానంలో ఎవరితోనూ కాసేపు చనువుగా కూర్చుని మాట్లాడ్డానికే ఆవిడకి తీరేదికాదు. అందులోనూ పెద్దకొడుకుతో అసలు చనువు లేదు. ఆ కోడలి దగ్గర ఎప్పుడూ పదిరోజులు ఉండలేదు. సంసార భారం కాస్త తగ్గి తీరిక చిక్కేవేళకి ముసలిదానితో ఎవరికి మాటలుంటాయి?

ఇప్పుడావిడ ఢిల్లీ వెళ్ళాల్సిన పరిస్థితి వచ్చింది. పెద్దకొడుకు ఇక్కడకు వచ్చి ఉండడని రాఘవయ్య ఇల్లు చిన్నకొడుకు పేర రాశాడు. ఆ విలువకి సరిపడా పొలం కొంత పెద్దకొడుక్కిచ్చాడు. అతనొచ్చి అది అమ్మేసుకుని వెళ్ళేడు.

తండ్రి పోయాక అన్నపూర్ణమ్మని ఎక్కడికీ వెళ్ళమన్లేదు చిన్నకొడుకు. ఆమెని ఆ ఇంటి మనిషిగానే గుర్తించాడు. కానీ హఠాత్తుగా నడివయస్సులోనే అతను పోవడంతో ఆ ప్రశ్న లేవదీసింది చిన్నకోడలు కృష్ణకుమారి.

ఆమె మగపిల్లలిద్దరూ హైస్కూలు చదువు ముగించుకుని, విజయవాడ రెసిడెన్షియల్‌లో ఇంటర్ చదువుతున్నారు. కూతురు ఈ సంవత్సరమే టెన్త్ పూర్తిచేసింది. భర్తపోయిన దుఃఖం, పిల్లలు దగ్గరలేని బాధ, వాళ్ళకక్కడ హాస్టల్‌కి చాలా డబ్బు కట్టవలసి వస్తోందన్న కష్టం. పైగా ఈ ముసలావిడ భారం. రాఘవయ్య బ్రతికున్నన్ని రోజులు డబ్బు పెత్తనం ఆయనది. ఇంటి పెత్తనం ఈవిడదీ. తనని బాగా అణచిపెట్టి ఉంచారు. తన భర్త మంచితనం చూసి. ప్రతీదానికి అత్తమామల అనుమతి కావల్సి వచ్చేది. భార్యకీ ఓ అచ్చటాముచ్చటా ఉంటాయని తన భర్తకి తెలియదు.

తనింక ఈ గుదిబండను మొయ్యలేదు. ఈ పిల్ల టెన్త్ ప్యాస్ కాగానే ఈ వూర్నించి మకాం మార్చెయ్యాలి. ఈ ఇల్లు ఎవరికైనా అద్దెకిచ్చేసి పిల్లలతో పాటు నగరంలో ఉండాలి. తనకీ, ఆవిడకీ లింకు తెగిపోయిందంతే.

"పోనీ మీ రెండో అమ్మాయి దగ్గరుండొచ్చు కదా! పెద్ద ఇల్లదీ ఉంది ఇక్కడికి దగ్గర!" అంది ఝాన్సీ.

"మా అల్లుడొప్పుకోడమ్మా. అయినా వాళ్ళింట్లో అతని నాయనమ్మ కూడా ఇంకా బ్రతికే ఉంది. నేను కూడా వెళ్ళి ఎక్కడుంటాను. ఆస్తిపాస్తులన్నీ కొడుకులకిచ్చి ఆడపిల్లల దగ్గర ఉండడం బాగుంటుందా? వాళ్ళేమనుకుంటారు?"

"పోనీ మీ నగలున్నాయి కదా! ఎంత లేదన్నా ఓ యాభైకాసుల బంగారం లేదా మీకు? ఇప్పుడు అన్నీ డబ్బులతో కొలవడం వచ్చాక మీరూ బేరం పెట్టాల్సింది. మిమ్మల్నెవరు చూస్తే వాళ్ళకి నగలిస్తానని" అన్నపూర్ణమ్మకి అంత దుఃఖంలోనూ నవ్వొచ్చింది తన నగల

ప్రహసనం గుర్తొచ్చి. అసలా నగలు తనవిగా ఎప్పుడున్నాయి? అవి ఎప్పుడూ ఇనప్పెట్టెలో ఉండేవి. దాని తాళంచెవులు ఆయన దగ్గరుండేవి. పెళ్ళిళ్ళకో, పేరంటాలకో వెళ్ళవలసి వచ్చినప్పుడు ఆయన ఇంట్లో ఉన్న సమయం కనిపెట్టి వాటికోసం అడిగి తీసుకుని మళ్ళీపని పూర్తికాగానే ఆయనకి అప్పగించడం. ఆమె వంటి మీద మట్టిగాజులతోపాటు రెండు జతల బంగారం గాజులూ, మెడలో నానుతాడు, నల్లపూసలూ ఎప్పుడూ ఉండేవి. రాఘవయ్యగారు పోయిన పదోరోజు నానుతాడులోంచి సూత్రాలూ, నల్లపూసలూ, మట్టిగాజులూ తీశారు. రెండు జతల బంగారు గాజులూ, మెడలో నానుతాడు ఉంచారు. ఈ ఉంచడం, తియ్యడంలో ఆమె ప్రమేయం ఏం లేదు.

పన్నెండోరోజు ఎవరిళ్ళకి వాళ్ళు వెడుతూ "ఇదుగో శీనూ నాన్న నెల మాసికానికి మేం అంతా వస్తాం. అప్పుడు అమ్మ నగలు పంచెయ్" అని హెచ్చరించింది పెద్ద కూతురు. తండ్రిపోయాక ఇనప్పెట్టి తాళంచెవులు శ్రీనివాస్‌కొచ్చాయి.

"ఆవిడింకా బ్రతికే ఉందిగా" అంది కృష్ణకుమారి.

"బ్రతికుంటే మాత్రం ఆవిడ వేసుకుంటుందా ఇక? మాకొచ్చే నగలకోసం ఆవిడ పోయేదాకా చూడాలా ఏమిటి?" అని దీర్ఘం తీసింది రెండో కూతురు.

వాళ్ళు నెలమాసికానికొచ్చారు. కంసాలి నరసింహాచారిని పిలిపించి, నగలన్నీ గుర్తు పెట్టుకుని అడిగి మరీ తూకం వేయించారు నలుగురు కూతుళ్ళు. 'అత్తగారి నగల మీద కోడళ్ళకేం హక్కులు లేవా' అని నిలదీసింది కృష్ణకుమారి.

గొడవలు, వాదాలు, ఏడుపులు, ముక్కుచీదుళ్ళ అనంతరం మొత్తానికి నగల పంపకం అయిపోయింది. ఈ కథంతా ఇప్పుడు తను ఝాన్సీకేం చెప్పగలదు! ఇప్పుడు తన వంటి మీద ముడతలు మాత్రమే ఉన్నాయి. "నీకేం అభ్యంతరం లేకపోతే మా ఇంట్లో ఉండు పిన్నీ. సుందరయ్యా, జ్యోతీ వెళ్ళిపోతున్నారు. ఇల్లంతా ఖాళీ. నిన్ను మా అమ్మలాగ చూసు కుంటాను. నువ్వు నాకేం ఇవ్వక్కర్లేదు. మా ఇంట్లో ఉండు అంతే. మా అమ్మ స్నేహితురాలివి నాకెంతో కావల్సిదానివి" అంది ఝాన్సీ. ఇది వొట్టి కంటితుడుపు మాట అని ఝాన్సీకి తెలుసు. కులాలు, ధర్మాలు, సంప్రదాయాల వంటి ఎన్నో అడ్డుగోడల్ని కూల్చే ధైర్యం తనకున్నా ఆవిడకి లేదు.

"మా అత్తగారు నాకేం బరువు కారు మాది కాస్త సౌకర్యంగా ఉండే ఇల్లే! ఆవిడకేం ఇబ్బంది ఉండదు" అంది పెద్దకోడలు సునీత.

సునీత తనని సరిగ్గా చూసుకోదని కాదు. స్థానచలన భయం. ఉన్న ఊళ్ళో మట్టి అయిపోవాలని ఒక కోరిక!

"అమ్మని బాగానే చూసుకుంటాంలే ఝాన్సీ. కొడుకుని నేనుండగా ఆమె నీ దగ్గర ఉండడం ఏమిటి? దిక్కులేనిదానిలాగ!" అన్నాడు పెద్దకొడుకు. ఆమెని సాగనంపడానికి వీధి చివరిదాకా వచ్చి.

రక్త సంబంధాలలో ఆర్థిక కాలుష్యాలు చోటు చేసుకుంటూన్న ఈ సందర్భంలో ఇంకా రక్తసంబంధాలే 'దిక్కు' అనుకోవడం సంప్రదాయాల బోలుతనం అని అతనికీ తెలిసే ఉంటుంది. కానీ సంప్రదాయ పరిరక్షణ పేరుతో ఎక్కడి వాళ్ళనక్కడ ఉంచడం కూడా నెరవేరుతుంది కదా! అమ్మ గుర్తొచ్చింది.

ముగ్గురు పిల్లలు పురుటిలోనే పోగా తను నాలుగో కాన్పు. అప్పుడు నాన్న జైల్లో ఉన్నారు. ఆయన ఇచ్చిపోయిన చాలీచాలని డబ్బుతో ఎంత కష్టపడి కుటుంబం నడిపిందో!

వాళ్ళిద్దరూ చాలా అన్యోన్య దంపతులనీ, అసలు తగాదాలే లేవనీ కాదు. పొలం కౌలుకిచ్చేసి దానిమీద వచ్చే ఐవేజు ఇంటిఖర్చుకు చాలకుండా ఆవిడ చేతికిచ్చి మిగతాది తనిష్టం వచ్చినట్లు ఖర్చు చెయ్యడాన్ని ఆవిడెలా ఒప్పుకుంటుంది ?

"నీకు దేశభక్తి లేదే బసవమ్మా" అని ఆయనా...

"నేనూ దేశం పట్టుకుపోతా నువ్వీ సంసారం ఈదవయ్యా" అని ఆవిడా, ఎప్పుడూ గొడవలే. ఆవిడ బహు కష్టం చేసేది. పిడకలు చేయడమేనా, కంపాకసరూ, తాటిగిలకల మీద వేడినీళ్ళు కాస్తూ పొగకి ఉక్కిరిబిక్కిరి అవడమేనా! ఇంటి చుట్టూ కూరగాయల మొక్కలు వేసి పెంచడమేనా? కందులు విసరడం, మినుములు విసరడం, పిండి కొట్టడం, ఆఖరికి కౌలుకిచ్చిన కాస్త పొలం తను స్వాధీనం చేసుకుని స్వంతంగా వ్యవసాయానికి దిగింది, తన తమ్ముణ్ణి తెచ్చి పెట్టుకుని.

స్వతంత్రం వచ్చింది. ఇహ చేసేదేం ఉందిలే అనుకుంటే, ఊరికి హైస్కూలు, ప్రైమరీ హెల్త్ సెంటరూ, బస్సులాగడానికో షెడ్డూ, ఒక లైబ్రరీ ఎన్నింటికోసం తిరగాలి మరి!

"ఇదుగో బసవమ్మా మనకున్నది మనకి చాలు. ఉండడానికిల్లుంది, తిండి గింజలున్నాయ్ ఎందుకట్లా గింజుకుంటావు? ఈ ఒక్క ఆడపిల్ల పెళ్ళి కాదనా? దాన్నిష్టపడ్డవాడికే యిస్తాగానీ కట్నం మాత్రం ఇయ్యను" అనేవాడాయన. "వుంది! వుంది! ఉండడానికిల్లు! ఏమిల్లయ్యా? మీ తాత కట్టిన ఇల్లిది ఎప్పుడో కప్పు కూలి మీదపడుతుంది" అని ఆవిడ.

ఆవిడ పోరు పడలేక పడమటి పొలం రెండెకరాలమ్మేసి ఇల్లు పడగొట్టి డాబా వేశాడు. దానికి 'ఆజాదీ' అని పేరు పెట్టాడు. హిందీభాష మీద మక్కువతో. జైల్లో ఉన్నప్పుడు హిందీ బాగా నేర్చుకున్నాడు. బెంగాలీ కూడా నేర్చుకున్నాడు. టాగోర్ అంటే చాలా యిష్టం. ఆయనతో జైల్లో ఉండొచ్చినవాళ్ళకి పదవులొచ్చాయి. పరపతీ వచ్చింది. తెల్లగా చలువ చేసిన నాణ్యమైన ఖద్దరు పంచెలు కడుతున్నారు.

"నేను పదవులకోసం పని చెయ్యలేదు" అని తన పనిలో తనుండే వాడాయన.

డాబా ఇంటికి ఇనపగేటు పెట్టించాడు. ఆ గేటుకి కొంచెం ఎడంగా ఆవిడ వేసిన మల్లెపందిరిని తను ఇప్పటికీ కాపాడుతోంది, ఆవిడ వేసిన మొక్కకి అంట్లు కట్టి. ఊరికి కరెంట్ వచ్చింది. సెప్టిక్ లెట్రిన్లు వచ్చాయి. ఎవరెడీ బ్యాటరీ పెట్టెతో పనిచేసే రేడియో తీసేసి హాలెండ్ నుంచీ వచ్చిన రేడియో సెట్ కొన్నాడు నాన్న. ఆయనకి ఎం.ఎస్. సుబ్బలక్ష్మి

పాటలంటే ఎంతో యిష్టం. ఆయనటు వెళ్ళగానే రేడియో సిలోన్‌లో హిందీ పాటలు వినేది తను. తనకీ సుబ్బలక్ష్మి మీరాభజన్లు చాలా యిష్టంగా ఉండేవి.

ఎస్సెసెల్సీ కాగానే రాఘవయ్యగారి సుభద్రకీ, బసవపున్నయ్యగారి వెంకటరత్నానికీ, జోసెఫ్‌గారి ఎలిజబెత్‌కీ పెళ్ళిళ్ళయ్యాయి. సంతోషం మాత్రం నర్సు ట్రైనింగ్‌కి వెళ్ళింది. ఆమెను చూస్తే అసూయనిపించింది. బసవమ్మ తల్లి తనని పొరుగూరు పంపి చదివించదు. పోనీ తెనాలి కాలేజీకి వెళ్ళి చదువుతానంటే ఒప్పుకుంది. అది తాత్కాలికమేనని తెలుసు.

తనూ, సులోచనా, సద్గుణా కలిసి వెళ్ళేవాళ్ళు. దానికి అనుమతించిందిగాని ఆవిడ మనసులో వేరే ఉద్దేశ్యాలున్నాయని ఝాన్సీకి తెలుసు. మిగిలిన ఈ 'ఒక్కనలుసు'నీ తనెంతో అపురూపంగా పెంచుకుంది ఆవిడ దృష్టిలో 'అపురూపం' అంటే గారాబం కాదు. చిన్నప్పటి నుంచీ తనకి ఇంటిపని నేర్పింది. తనతో పొలం తీసుకెళ్ళింది. కానీ ఆ నలుసుని విడిచిపెట్టి తను వుండలేనని ఆవిడకి తెలుసు. తమ దగ్గర ఉన్న ఈ కాస్త పొలం చూసి ఏ కుర్రవాడూ ఇల్లరికం రాడని ఆవిడకి బెంగ. అలాంటి మంచి కుర్రవాడు దొరికితే ఝాన్సీ చదువు అక్కడికి ఆపడమే. వెంకట్రామయ్య ఇల్లు నడిపే బాధ్యత ఆవిడ మీద వదిలేసి ఉద్యమాలలో తిరిగినా, ఆమెని 'వొసేవ్' అని పిలవడంగాని, విసురుకోవడం, తిట్టడం కాని చేసేవాడు కాదు. ఇంట్లో ఉన్న కాసేపూ నీళ్ళు తోడిపోయడం వంటి పనులు చేసి పెట్టేవాడు. చాలామంది మగవాళ్ళు భార్యల్ని ఏడిపిస్తారనీ, తనకొచ్చే అల్లుడు అట్లా ఉండకూడదనీ, ఆ అల్లుడు తన కొడుకులా తన ఇంట్లోనే ఉండాలనీ ఆవిడ కోరిక. ఆవిడ కోరిక నెరవేరింది. ఈమెకి వరసకి తమ్ముడైన రామ్మోహన్ రూపంలో!

అతనికి తండ్రి వ్యాపారం మీద యిష్టం లేదు. తండ్రి పల్లెటూళ్ళో పొలం అమ్మడం అసలిష్టంలేదు. బి.ఎ. చదివాడు కానీ ఉద్యోగం యిష్టంలేదు. వ్యవసాయం చేసుకుంటానంటే తండ్రి ఒప్పుకోలేదు.

అప్పుడే బసవమ్మ తన ప్రతిపాదన వినిపించింది. "మావూరొచ్చేయి తమ్ముడూ, నీకు మంచి పొలం కౌలుకిప్పిస్తా" అని.

కుటుంబరావుగారు ఒప్పుకున్నారు. వీధి వీధంతా పందిరి వేశారు. అప్పుడే రాఘవయ్య గారి ఉత్తర పొలం పదెకరాలు కౌలుకి తీసుకున్నాడు రామ్మోహన్. తండ్రి నడిగి పదివేలు తెచ్చాడు. పొలం మీద శ్రమనీ, ప్రేమనీ సమానంగా పంచాడు. అతనికి అమ్మానాన్నలంటే గౌరవం. ఝాన్సీ అంటే ప్రేమ. ఆమెతో స్నేహం, పూలన్నా, పాటలన్నా, మట్టి అన్నా యిష్టం. డాబా మీద కూర్చుని వెన్నెల్లో పాటలు పాడేవాడు. ఎన్ని విషయాల మీదో కబుర్లు చెప్పేవాడు. అమ్మ చాలా పొదుపుగా ఉండేది. జీవితం ఆమెకి నేర్పింది పొదుపే. తనకి చిన్నప్పుడు చాలా సుస్తీ చేస్తే తెనాలి ఆస్పత్రికి తీసుకువెళ్ళడానికి డబ్బు లేకపోయింది. తన రెండుపేటల పలకసర్లు నాన్న గాంధీగారికిమ్మంటే యివ్వకుండా దాచేసిందట. దాన్ని బోసుబాబు తండ్రి

'అచ్యుతరామయ్య అన్నయ్య' దగ్గర తాకట్టుపెట్టి డబ్బు తెచ్చి తనని బ్రతికించింది. చివరికి దాన్నెలాగో విడిపించి తెచ్చింది.

ఇల్లు నడిపించాల్సిన బాధ్యత గురించి పొదుపే గానీ, మళ్ళీ వితరణ కూడా ఉండేది. అందుకే ఆదెమ్మ సంసారాన్ని తెచ్చి పెరట్లో పాకవేసి పెట్టింది. ఎవరికీ పెట్టకుండా ఏమీ తినేది కాదు. 'ఎవరికీ' అంటే ఇంట్లోవాళ్ళకి కాదు. ఏం వండినా ఆదెమ్మకీ, చాకలి బాలమ్మకి ఇట్లా పెడుతూ ఉండేది. సరోజినికి పదేళ్ళొచ్చేసరికి వెంకట్రామయ్యగారు పోయారు. అది మెడిసిన్‌లో చేరేనాటికి బసవమ్మ తల్లీ వెళ్ళిపోయింది. ఈమధ్యనే 'సుందరయ్య' తాత కుటుంబరావుగారూ వెళ్ళిపోయారు.

సరోజిని చదివినంత శ్రద్ధగా సుందరయ్య చదవడు. అసలు సుందరయ్యకి రామ్మోహన్ మీద ఉండవలసినంత సదభిప్రాయం లేదనుకుంటుంది ఝాన్సీ. సుందరయ్యకి బోసుబాబంటే అమిత అభిమానం. బోసుబాబు తన తండ్రి సంపాదించి యిచ్చిన ఆస్తిని నాలుగు రెట్లు చేశాడు. వడ్డీ వ్యాపారం చేసి, అతని తండ్రి అచ్యుతరామయ్య ఈ వీధిలో తనింటి ప్రక్కనున్న మూడిళ్ళు కొంటే, ఇతను చిన్నాచితక రైతులు అమ్మిన ఒకటి రెండెకరాల పొలాలన్నీ కొని ఊళ్ళో సగం పొలం ఆక్రమించాడు. తండ్రికొన్న మూడిళ్ళు పడగొట్టించి, పెద్ద బంగళా కట్టించాడు. తెనాల్లో సినిమాహాలు కొన్నాడు. గుంటూర్లో హోటల్ కట్టాడు. విజయవాడలో స్థలాలు కొన్నాడు. ఉన్నచోట గట్టిగా పాతుకుని అన్ని దిశలకీ ఊడలు దించాడు. కొడుకుని ఊటీ స్కూల్లో చదివించాడు. ఇప్పుడమెరికా పంపించాడు. పరపతి గల పెద్ద మనుష్యుల కొడుకులతో కూతుళ్ళ పెళ్ళిళ్ళు చేశాడు.

మంత్రులతో స్నేహం సంపాదించాడు. సమర్థుడంటే అతను.

కుటుంబరావు తాత విజయవాడలో బ్రహ్మాండంగా స్థిరపడ్డాడు. అతని ఇద్దరు కొడుకులూ పరిశ్రమని పెంచారు. అప్పుడెప్పుడో రామ్మోహన్ కిచ్చిన పదివేల రూపాయల అప్పుని అతని వాటా క్రింద సరిపెట్టి 'ఇంక నీకేంరాదు' అని అప్పుడే చెప్పాడాయన. అప్పటి పదివేలు ఇప్పుడు పదిలక్షలతో సమానం అన్నాడు. అసలక్కడికి ఇల్లరికం ఎందుకు వెళ్ళావన్నాడు. ఆ కుటుంబంతో రాకపోకలు తగ్గిపోయాయి. ఇరవై ఏళ్లు ఎండకి ఎండి, వానకి తడిసి మహాగొప్పగా పదెకరాలు కొన్నాడు. విజయవాడలో ఉండి ఉంటే పెద్దనాన్నల్లాగ ఉండేవాడని సుందరయ్యకి కోపం. బోసుబాబు కొడుకులాగ ఊటి పంపి చదివించలేదని! ఇట్లా చాలా ఉన్నాయి కోపకారణాలు! రామ్మోహన్ బ్రతికి ఉన్నన్నాళ్ళు తండ్రీ కొడుకులకి ఏ విషయంలోనూ ఏకాభిప్రాయం కుదిరేది కాదు.

"వాడికటు చదువూ లేదు. ఇటు మీతో పొలానికీ రాడు. పెళ్ళి చేస్తే బాధ్యత తెలుస్తుందేమో" అంది ఝాన్సీ. కస్తూరమ్మ జ్యోతి సంబంధం తెచ్చింది. జ్యోతికి తండ్రి లేడు. అన్న రాంబాబుదే ఇంటి పెత్తనం. అతనేం చేస్తాడో తెలీదు. కాని అతనికి మాత్రం రామ్మోహనూ, ఝాన్సీ కొడుక్కి కట్నం తీసుకోరని తెలుసు. పన్నెండెకరాల మాగాణి భూమి ఉందని తెలుసు. అత్తా మామ మంచివాళ్ళని కస్తూరమ్మ చెప్పింది.

అట్లా జ్యోతి ఈ 'పాతడాబా'లోకి, ఈ పల్లెటూరికి వచ్చింది. తను ఉండి వచ్చింది చిన్న పట్నం అయినా, ఆమెకీ వూరు శుద్ధ పల్లెటూరులా కనిపించింది. ఆమె ఈ ఇంటికి రామ్మోహన్, ఝాన్సీల కోడలుగా కాక, కేవలం సుందరయ్య భార్యగానే వచ్చింది. జ్యోతి రాగానే రామ్మోహన్ కొడుక్కి పంట డబ్బుల్లో సగం యిస్తూ వచ్చాడు. అతను, ఆమె ఆ డబ్బు ఎట్లా ఖర్చు పెడుతున్నారని అడిగేవాడు కాదు. జ్యోతి వచ్చిన ఐదేళ్ళకే అతను హఠాత్తుగా పోయాడు.

సుందరయ్య వచ్చినట్లున్నాడు. రేపు రాత్రి తొమ్మిదింటికి లారీ వస్తుందని చెబుతున్నాడు. ఇప్పుడు సుందరయ్య తనతో మాట్లాడ్డం లేదు. అవసరం అనుకుంటే తప్ప...

తనకీ రామ్మోహన్‌కీ మధ్య, తనకీ తండ్రికీ మధ్య, తల్లికీ తనకీ మధ్య ఎప్పుడూ డబ్బు గురించిన సమస్యలు రాలేదు. పోయింది పోగా ఉన్న రెండెకరాల పొలం దగ్గరుండి సేద్యం చేసుకునేవాడు తండ్రి.

వడ్లమ్మిన డబ్బు రాగానే అమ్మ గబగబ సంవత్సరానికి సరిపడ కందులూ, పెసలూ, మిరపకాయలు కొని పెట్టుకునేది. తనకీ అమ్మకీ రెండు మూడు జతల బట్టలు కొనేవాళ్ళు. బట్టలు చాలా జాగ్రత్తగా వాడుకునేవాళ్ళు.

రామ్మోహన్ తనకొచ్చిన డబ్బు తెచ్చి అమ్మ దగ్గర యిచ్చేవాడు. ఇంటికి వాడగా మిగిలింది ఆవిడ దాచేది. అట్లా దాచి రాఘవయ్యగారి పొలం కొన్నాడు రామ్మోహన్. అది తన పేర కొంటాననంటే తను వద్దంది. అతని పేర ఉండడమే న్యాయం అంది. ఇంట్లో ఒక ప్రజాస్వామిక వాతావరణం ఉండేది. రామ్మోహన్ ఉండగా బీరువాకి రెండు తాళం చెవులు ఉండేవి. ఒకటి తన దగ్గరుండేది. రమణగాడికి స్కూలు ఫీజు కట్టాలన్నా, ఆదెమ్మకి రెండు చీరలు కొనివ్వాలన్నా, ఊళ్ళో లైబ్రరీకి నాలుగు పుస్తకాలు కొనివ్వాలన్నా, పిన్ని పిల్లలకో, మావయ్యగారి పిల్లలకో ఏదైనా బహుమతి కొనాలన్నా తను డబ్బు తీసుకుని వాడేది. అదెవరు వాడాలి? ఎవరిది పెత్తనం? అన్న ప్రశ్న ఉండేది కాదు. రామ్మోహన్ పోగానే సుందరయ్య తన తాళం చెవి తీసుకున్నాడు. పోయిందన్నాడు. పొలం మీదొచ్చే డబ్బు తనే ఖర్చు పెడుతున్నాడు. ఇంటి ఖర్చంతా తనే చూస్తున్నాడు. జ్యోతికి బంగారం గాజులు చేయించాడు. రమణగాడికి ఫీజు కట్టక్కర్లేదన్నాడు. రెండేళ్ళు తను మాట్లాడలేదు. మూడో ఏడు మాట్లాడలేదు. నాలుగో సంవత్సరం నోరు విప్పింది.

"మీ నాన్న పొలం నీదన్నావు సరే. మరి మా నాన్న పొలం నాదని మర్చిపోకు. ఈ సంవత్సరం నించీ నా పొలం నేను చూసుకుంటాను. నా పంట నేను తీసుకుంటాను" అంది.

చాలా గొడవైంది. 'ఇదెక్కడి తల్లి!' అన్నారు. అంతా "బసవమ్మ పోలికే. ఆవిడ గయ్యాళితనమే వచ్చింది. బసవమ్మెప్పుడూ పొలంలోనే ఉండేది. ఆ ఇంటి ఆడవాళ్ళదే పెత్తనం. రామ్మోహనుండగా అట్లా ఉండి ఇప్పుడు బయటపడింది" అన్నారు కొంతమంది ఊళ్ళోవాళ్ళు.

రామ్మోహన్ పొలం వాళ్ళ స్వంతమైనట్లు తనకి ఉచితంగా తిండి పెడుతున్నట్లు మాట్లాడేరు. అప్పటి నించీ మనవరాలు స్రవంతికి ఏడాదికి కాస్త బంగారం కొనిస్తోంది. సుందరయ్య విజృంభించాడు. పొలం మీద అప్పు తెచ్చి చేపల చెరువులు లీజుకి తీసుకున్నాడు. లాభం వచ్చింది. అప్పులు తీర్చకుండానే బావికి మోటార్ పెట్టించి, డాబా మీద ట్యాంక్ కట్టించి, బాత్‌రూంలో గీజరు వేయించాడు. వి.సి.ఆర్ కొన్నాడు. మళ్ళీ వచ్చిన లాభంతో షేర్లు కొన్నాడు. కానీ అప్పు తీర్చలేదు. షేర్ల మీద వచ్చిన లాభంతో మళ్ళీ షేర్లు కొన్నాడు. అప్పు తీర్చలేదు.

కొడుకుని చిన్నవాడైనా సరే తీసుకువెళ్ళి హైదరాబాద్‌లో ఒక ఖరీదైన స్కూల్లో చేర్పించి వచ్చాడు. అప్పటికే సుందరయ్య బావమరిది రాంబాబు హైదరాబాద్ మకాం మార్చి ఉన్నాడు. రియల్ ఎస్టేటు చేస్తున్నాడు. కొడుకుని అమ్మమ్మ దగ్గర ఉంచాడు. వాడికట్లా పునాది వేశానన్నాడు. షేర్లు మునిగిపోయాయి. భారీ నష్టాలు. కొంత పొలం అమ్మి అప్పు తీర్చాడు. బోసుబాబు రెండో అల్లుడు కొనుక్కున్నాడు. లారీలు కొన్నాడు. నష్టానికి అమ్మేశాడు. వెధవ పల్లెటూరు రోజుకి ఎనిమిది గంటలు కరెంటుండదు. వ్యవసాయం దండగ వ్యవహారం.

రాంబాబు రమ్మంటున్నాడు. రాంబాబిప్పుడు బాగా పెరిగిపోయాడు. అపార్ట్‌మెంట్లు కట్టి బాగా సంపాదించాడు. ఇప్పుడు హోటల్ కడుతున్నాడు. తన 'చేతి క్రింద' ఉండమంటున్నాడు. జ్యోతికి కూడా ఏదో వ్యాపకం చూస్తానన్నాడు. తను కట్టబోయే హోటల్‌లో పెట్టబోయే 'బ్యూటీ పార్లర్' కోసం తన భార్యకీ, జ్యోతికీ 'బ్యూటీ కోర్స్' నేర్పిస్తానన్నాడు.

'అసలు సుందరయ్య లాంటి వాళ్ళకి వ్యాపారాలు చెయ్యడం రాదు. అందుకే అన్నీ నష్టాలొస్తున్నాయి. వ్యాపారంలో 'మెళకువలు' నేర్చుకోవాలంటే ఏ బోసుబాబు దగ్గరో, రాంబాబు దగ్గరో కొన్నాళ్ళుండాలి. వాళ్ళ చేతి క్రింద ఉంటేనే వ్యాపారంలో సులువులు తెలుస్తాయి. వాళ్ళల్లాగ పైకొస్తాడు' ఇదంతా జ్యోతి అభిప్రాయం. రాంబాబు ఒకసారొచ్చాడు. ఇప్పుడు సుందరయ్య పొలం మీద వచ్చే ఆదాయాన్నీ, అది అమ్మి బ్యాంకులో వేస్తే వడ్డీనీ ప్రక్కప్రక్కన పెట్టి చూపించాడు.

చాకలి రాములు హైదరాబాద్ వచ్చి అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా ఉండి ప్రక్కన బండి పెట్టుకుని సుఖంగా ఉన్నాడు. మంగలి సూర్యం సెలూన్ పెట్టి కారు కొన్నాడు. ఆఖరికి లక్ష్మీకాంతంగారి మరణం తరువాత ఆయన భార్య యిప్పుడక్కడ ఆడవాళ్ళ హాస్టల్‌లో వంటలు చేసి సంపాదించుకుంటోంది. పిల్లల్ని చదివిస్తోంది. ఇట్లా, చిన్నా చితకా ఎందర్నో అక్కున చేర్చుకున్న నగరం సుందరయ్యని వదులుకుంటుందా? పదపోదాం! ఇరవై సంవత్సరాలు చెమటోడ్చి రామ్మోహన్ సంపాదించిన పదెకరాల పొలంలోని ఆఖరి చెక్క బోసుబాబు గారి బొంబాయి అల్లుడు కొనుక్కున్నాడు.

కళ్ళ ముందు ధన కనక వస్తు వాహన సంపదలు కనిపిస్తున్నాయి. అవి అనుభవిస్తున్న మనుష్యులు కనిపిస్తున్నారు. అవన్నీ చూస్తూ కూడా, వాటిని ఆశించకుండా ఉన్నచోటనే

ఉండి, ఉన్నదే తిని బ్రతకమని చెప్పడం సమంజసమా? ఏ తరం పద్ధతులు, ప్రయోజనాలు ఆ తరానివి. ప్రయోగాలు చేస్తేనే కదా ఫలితాలొస్తాయి? నిలబడి నీళ్ళు నములుతూ ఉండేదాని కన్నా పరిగెత్తి పాలు తాగాలనుకోడం తప్పుకాదేమో! అవసరాలు మారుతున్నాయి. అభిప్రాయాలు మారుతున్నాయి. వాళ్ళు వెళ్ళిపోవడానికి తనింత బాధపడకూడదేమో! ఉన్నచోట తిండి దొరక్క, పొట్ట నిండక ఊరు వదిలి బ్రతుకుతెరువు కోసం వలసపోవడం పద్ధతే! అధిక సుఖాలు వెతుక్కుంటూ వలసపోవడమూ పద్ధతేనా? ఈ రెండు వలసలూ ప్రక్కప్రక్కనే సాగుతున్నాయ్ మన దేశంలో!

ప్రపంచం అంతా ఇట్లాగే ఉందేమో ఏకధృవం కదా! తనిట్లా ఆలోచిస్తూ ఉండగానే అన్నీ జరిగిపోతాయి. బోసుబాబు షష్ఠిపూర్తి ఉత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. మంత్రి మిత్రులొస్తారు గనుక పత్రికల్లో వార్త బాగానే పడుతుంది. జిల్లా ఎడిషన్‌లోనే గాక మెయిన్‌పేపర్లో పడినా పడొచ్చు. బోసుబాబు అప్పుడు ఆంధ్రప్రదేశ్ అంతా తెలుస్తాడు. కాబోయే రాజకీయ నాయకత్వానికి ఒక పునాది రాయి పడుతుంది.

సుందరయ్య రాంబాబు 'చేతిక్రింద'కి వెళ్ళిపోతాడు. రాంబాబంతైనా కావచ్చు, బోసుబాబంతైనా కావచ్చు, కాకనూపోవచ్చు.

తనకున్న రెండెకరాల భూమినీ, 'ఆజాదీ'ని కొనడానికి బోసుబాబు గారి అమెరికా కొడుకు సిద్ధంగా ఉన్నాడు. అతనికిచ్చే మూడువారాల సెలవుని స్వచ్ఛమైన పల్లెటూరి వాతావరణంలో తన స్వంత ఇంట్లో గడపాలని ముచ్చటపడుతున్నాడు.

తను మాత్రం వాటిని వదులుకుని పిల్లల దగ్గరికి వెళ్ళడానికి సిద్ధంగా లేదు.

వాళ్ళంతా ఎవరెవరి ఆలోచనల ప్రకారం వాళ్ళు నడుచుకుంటూ ఉంటే, తనెందుకు తన మార్గంలో పోకూడదు. కొంచెం ఆలస్యమైంది. సరే ఇప్పటికైనా తనూ ఒక మార్గాన్ని ఎంచుకోవాలి. అసలు వెంకట్రామయ్య, బసవమ్మలకి ఒక కొడుకు ఉండి ఉంటే ఎట్లా ఉండేదో!

ఈ ఇంటికతను వారసుడై ఉండేవాడు. అప్పుడు తను 'ఒక్క నలుసు' కాదు గనక, తనకి పెళ్ళి చేసి అత్తగారింటికి పంపేసేదేమో అమ్మ!

ఆ అత్తగారిల్లూ, ఆ భర్తా ఎట్లా ఉండేవాళ్ళో! రామ్మోహన్‌లా, ఒక స్నేహితుడిలా ఉండేవాడా? ఉండేవాడు కాదేమో! పుట్టని ఆ అన్నో తమ్ముడో తల్లిదండ్రుల ప్రేమని తనకొక్కదానికే వదిలేశాడు. చాలామంది ఆడవాళ్ళకి లేని ఇల్లు, కాస్త భూమీ తనకి వదిలేశాడు. ఇప్పుడీ 'ఆజాదీ'ని తను కాపాడుకోవాలి. దీన్ని ఒక గూడుగా ఒక నీడగా రూపొందించాలి. ఎప్పటినించో ఆవరించి ఉన్న దుఃఖపు తెర కొద్దికొద్దిగా తొలగించాలి. ఏదైనా చెయ్యాలి. మార్గమేదో స్పష్టమౌతోంది. గేటుప్రక్క మల్లెచెట్టు నిండా మొగ్గలు నిట్టూర్పు పరిమళాలు వెదజల్లుతున్నాయి.

*ఆదివారం ఆంధ్రప్రభ, 1 జూన్ 2003*